'రాధా!

మనిషి విలువ డబ్బూ, హోదాల్లో లేదు. హృదయంలో ఉంది. మనిషికి ఉండవలసింది మార్దవంతో నిండిన చల్లని మనసు, సానుభూతి చూపించ గలిగే సహృదయం. రాధా! నువ్వేం కావాలనుకున్నావు? నువ్వేం పొందగలిగావు? నీ కేం మిగిలింది?!'

రాధని చూసిన క్షణం నుంచీ బాధ పడిపోతూ పిచ్చివాడిలా అయిపోయాడు కృష్ణ.

* * *

"మా ఆఫీసరు ఒంటరివాడు. పెళ్లి చేసుకోలేదు. చాలా మంచివాడులే, పాపం! వంటవాళ్ళతోనూ, హోటళ్ళతోనూ వేగలేక, అయినవాళ్లెవరూ లేక వండుకుంటున్నాడు. ఇంత పెద్ద ఆఫీసర్నని గర్వం లేదు. అందరితోనూ సమానంగా మాట్లాడతాడు. అహంభావం అసల్లేదు. వర్కు చాలా బాగా చేస్తానని నేనంటే ఎంతో అభిమానం. ఇంతవరకూ నా రక్తం నీళ్లలా ధారపోసి ఆఫీసుకే అంకితమై పోయినా, నన్ను మెచ్చుకుని ఓ మంచి రిపోర్ట్సు రాసిన నాథుడు లేడు. ఏదో ఈయన ధర్మమా అని ఓ మంచి రిపోర్ట్సు రాస్తే — ఏదో కాస్త పైకి జరగడానికి వీలుంటుంది.

చూడు, రాధా! కాస్త ఆవకాయా, గోంగూరపచ్చడీ— ఆఁ! అదే—కొంచెం సీసాల్లో— పెట్టి ఇయ్యి. మన పచ్చళ్ళంటే చాలా ఇష్టంట!" అన్నాడు రామారావు.

అంతవరకూ పరాగ్గా వింటున్న రాధకి ఈ మాటలతో చిర్రెత్తు కొచ్చింది. కాపరానికి వచ్చిన దగ్గర్నుంచీ పై ఆఫీసర్లకి ఆవకాయలూ, పచ్చళ్లూ పెట్టటం, పిండివంటలు చేసి పెట్టటంతోనే సరిపోయింది. మెప్పా, పాడా? ఉన్నచోటునుంచి అంగుళం మేరకూడా జరగలేదు బ్రతుకు. పైకనే ధైర్యం లేక మనసులోనే విసుక్కుంటూ సణుక్కుంది.

"ఆఁ— అన్నట్టు, రాధా, డబ్బేమైనా ఉందా?"

"మీకు తెలియందేముందీ?"

"పోనీ, బామ్మగార్నేమైనా అడిగి తెస్తావా?"

"ఎందుకో చెప్పరాదూ?"

"రేపు మా ఆఫీసరు భోజనానికి వస్తాడు!"

విస్తుపోయింది రాధ. ఆఫీసరు భోజనానికి వస్తాడా? పిలవడానికి ఈయనకి లేకపోతే, రావటానికి ఆయనకైనా ఉండద్దూ! మనసులోనే గింజుకుపోతూంది రాధ.

"అలా రాయిలా నించోపోతే అవిణ్ణి అడిగి రారాదూ? లేదంటే. మరో దారేదైనా చూసుకోవచ్చు!" విసుక్కున్నాడు రామారావు.

"మొన్ననే కదా— పది రూపాయలిచ్చిందీ? అస్తమానూ అడిగితే ఆవిడ మాత్రం ఎక్కణ్ణుంచి తెస్తారూ? అందులోనూ నెలాఖరు కదా?"

**విలువ డబ్బు, హోదాలలో లేదు. హృదయంలో ఉంది. మనిషికి ఉండవలసింది చల్లని మనసు, సానుభూతి చూపగల సహృదయం. అంతస్తుల అడ్డుగోడలు కట్టుకుని యథార్థాన్ని ఆవేశంతో తూలనాడడం, విలువలు మారినా బండబారిన గుండె లోతుల్లోంచి కక్ష కక్కించి బ్రతుకు బాటల్లో చీకట్లు పరుచుకోవడం అపరాధమే.**

"అడక్కుండానే అన్నీ నువ్వే చెప్పేస్తావు?" కసిరేశాడు రామారావు.

ఆ విసురుకి పరుగులాంటి నడకతో వెళ్లి, లేదనిపించుకుని వచ్చేసింది. ఇక గత్యంతరం లేక మంగళసూత్రం తీసి ఇచ్చింది.

ఎలాగో పక్కింటి బామ్మగార్ని అడిగి నాలుగూ తెచ్చుకుని, అన్నీ అమర్చుకుంది. ఉన్నదాంట్లోనే అన్నీ శుభ్రంగా చేసుకుంది. పెట్టేవరకూ అడక్కూడదనీ, అల్లరి చెయ్యకూడదనీ, ముఖ్యంగా నాలుగోవాడు నాసికి పేచీలు పెట్టవద్దనీ, బుద్ధిగా ఉంటే సినిమాకి తీసుకువెళతాననీ పిల్లలకి చెప్పింది. 'హుఁ! ! పుట్టింట్లో యువరాణిలా బ్రతికాను. ఎప్పుడూ ఊహించికూడా ఎరుగను ఇలాంటి దరిద్రాన్ని. 'బుద్ధిః కర్మానుసారిణీ' అని వచ్చిన గొప్ప సంబంధాలన్నీ కాలదన్నుకున్నాను. గుర్రప్పందాల్లో నాన్నఆస్తంతా నిప్పెట్టినా, అత్తింట్లోనైనా హాయిగా బతికేదాన్ని. బి. ఎ. డిగ్రీ ఉంది. ఏం లాభం? ఉద్యోగం చెయ్యటానికి వీల్లేదు. అన్నీ అనుమానాలే! ఆంక్షలే! అపార్థాలే! కనీసం ట్యూషన్ను చెపుతానన్నా ఒప్పుకోరు. "నువ్వు సంపాదించి నన్నేం ఉద్ధరించక్కర్లేదులే" అంటారు. ఎంత మూర్ఖత్వం! ! నేనూ సంపాదిస్తే ఇంత బాధ ఉండకపోనే! నే నెందుకు ఉద్యోగం చేస్తానంటున్నానో అర్థం చేసుకోరేం? ఈ రోజుల్లోకూడా ఇలాంటి చాదస్తం మనుషు లున్నారంటే నా లాంటి వాళ్ల ఖర్మే మరి!

పోనీ, ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుందామంటే విన్నారా? ఆపరేషన్కి వచ్చినా ఒప్పుకోరు! అన్నీ మూర్ఖపు అనుమానాలే! పోనీ, నేనే చేయించుకుందామంటే పురిటి పురిటికీ గండమే కదా! ఊపిరినెప్పి నాకు. ఒంటి ప్రాణంతో బ్రతికి బయటపడే నాకు,వాళ్ళు ఆపరేషన్ చెయ్యరు. ఇదీ ఓ దురదృష్టమే మరి! భగవంతుడా! నే నేం పాపం చేశాను? ఈ బ్రతుక్కోసం పులిపిల్లలా పెరిగాను. పిల్లిపిల్లలా బ్రతుకుతున్నాను! నిరాశా నిస్పృహలే నా బ్రతుకని ఎప్పుడూ అనుకోలేదు!' వంట చేసి, అన్నీ సర్దుకుంటూ, ఇప్పటి తన బతుకును తలుచుకుంటూ కుళ్లి కుళ్లి ఏడ్చింది రాధ.

సరిగ్గా పన్నెండు గంటలకి భోజనానికి కూర్చున్నారు రామారావూ, ఆ ఆఫీసరూ.

'అవును!! ఎక్కడో చూశాను ఈయన్ని. ఆ పెద్ద పెద్ద కళ్ళు ఎవర్నో జ్ఞాపకం చేస్తున్నాయి. ఆ మాట కూడా పరిచయమైన మాటలాగే ఉంది! కానీ, ఎవరో దబ్బున జ్ఞాపకం రావటం లేదు.' జ్ఞాపకం తెచ్చుకోవాలనే ప్రయత్నంలో సతమతమై పోతూంది రాధ. వడ్డిస్తూంటే రాధవేపు ఒకటి రెండు సార్లు పరిచయంగా చూసి, చిన్నగా నవ్వాడు ఆఫీసరు. దబ్బున బుర్ర వంచేసుకుంది రాధ. అన్నీ బాగున్నాయంటూ పదేపదే మెచ్చుకుంటూ భోజనం చేశాడు ఆఫీసరు.

భోజనాలైనాక ఈజీఛెయిర్లో జార్లపడుతూ, ఒంటిగంటకల్లా ఆఫీసుకు వెళ్లాలని తొందర పడ్డాడు. రిక్షా కోసం వెళ్లాడు రామారావు. "రాధా!" అంటూ చనువుగా పిలిచిన ఆఫీసర్ని సీరియస్గా చూస్తూ, "నా పేరు మీ కెలా తెలుసు?" అంది.

"నీ పేరేమిటి — నువ్వే తెలుసు, రాధా, నాకు! నేను జ్ఞాపకం లేనా?"

"ఉహుఁ! మీ రెవరో నాకు తెలియదు. అసలు చూసిన జ్ఞాపకం కూడా లేదు నాకు" అంది విసురుగా.

"ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నించు. మీ ఊరూ, మీ పుట్టింట్లో మనుషులూ వరసగా జ్ఞాపకం తెచ్చుకుంటే—నువ్వొకసారి చులకనగా తీసిపారేసి, హేళన చేసిన ప్రేమూ, కణ్ణా జ్ఞాపకం వస్తారు!"

"ఆఁ నువ్వా? !" అంది ఆశ్చర్యపోతూ.

"ఆఁ నేనే!!" అంటూ బాధగా నిట్టూర్చాడు. ఇంతలోకే రిక్షా వచ్చిందంటూ, రామారావు లోపలికి రావడం కకావికలమైన మనసుతో రాధ లోపలికి వెళ్లిపోవటం జరిగిపోయింది.

* * *

"నువ్వా? !" అంటూ తెల్లబోయి, చదువుతున్న పేపరు పక్కన పెట్టి, "కూర్చో" అన్నాడు.

"నేను కూర్చోవటానికి రాలేదు."

"మరి?"

"ఒక విషయం చెపుదామని. . ."

"ఒక విషయమైనా, రెండు విషయాలైనా కూర్చునే చెప్పవచ్చుగా? కూర్చో, ఫరవాలేదు!"

ఓ పక్కగా సోఫాలో ఒదిగి కూర్చున్న రాధని రెప్పవేయకుండా చూస్తూ, "ఇంత ఎండలో రాకపోతే కబురు చెయ్యకూడదూ? నేనే వచ్చేవాణ్ణిగా! గొడుగైనా తెచ్చుకోలేదా?" అన్నాడు.

"అంత సుకుమారినేం కాదులే!"

"నాకు తెలుసు !" అంటూ చల్లని మంచినీళ్ళగ్లాసు అందించాడు. "ఇప్పుడు చెప్పు!" అంటూ అభిమానంగా అడిగాడు.

"ఒక విధంగా మా కది సహాయమే!"

"నువ్వు చెప్పనక్కర లేకుండానే నిన్ను చూసినక్షణంనుంచి అనుకుంటున్నాను— నిన్ను ఆదుకోవాలని!!"

"థాంక్స్! నువ్వేవిధంగానూ మమ్మల్ని ఆదుకోనక్కరలేదు! ! మాకు ఈ ఊరు నుంచి ట్రాన్స్ఫర్ అయ్యేలా చూడు. అదీ ఓ వారం రోజుల్లో... చాలీ పాటి సహాయం!!"

"రా. . .ధా! !" అదిరిపడ్డాడు.

"ఇది నీ చేతిలో పనే!" అంది నిబ్బరంగా.

"ఎందుకనీ?!"

"నీ ఉనికిని నేను భరించలేను!"

"అందుకనీ. . .?"

"చెప్పానుగా! త్వరగా అయ్యేలా చూడు !" లేచి గుమ్మం దాటబోయింది.

"ఆ. . . గు! !"

త్రుళ్లిపడింది రాధ! ! 'ఒకప్పుడు తన ఆజ్ఞని మీరలేని వాడు ఈనాడు నన్నాజ్ఞాపిస్తున్నాడా?' ఉడికిపోయింది రాధ మనసు. వెనుదిరుగుతూ—"కణ్ణా! ఆ నాటివాడవే ఈ నాడుకూడా— నా దృష్టిలో! అడగడానికి వచ్చానుకదా అని అలుసుగా చూడకు! నువ్వు ఆఫీసరువు కావచ్చు. కానీ, నేను నీ గుమాస్తా నేం కాదు!" అంది తీక్ష్ణంగా చూస్తూ.

"రాధా! అపార్థం చేసుకోకు. నేను నీ కోసమే ఇంతవాణ్ణి అయాను! ప్చ్! ! విధి న న్నెప్పుడూ వంచిస్తూనే ఉంది. చెప్పు, రాధా, చెప్పు! ఏమైంది? ఎందు కిలా జరిగింది? అంతా ఎలా పోయింది? మీ నాన్నగారెక్కడ?" చెప్పమని ప్రాధేయపడుతూ దగ్గరగా వచ్చాడు.

"అవన్నీ చెప్పడానికి నా కిప్పుడు తీరికగానీ, ఓపికగానీ లేదు. నే వెళుతున్నాను. నేను చెప్పిన విషయం మటుకు గుర్తుంచుకో! నీ కేమాత్రం విశ్వాస

# మారిన విలువలు



-ఆదిమధ్యం కమలం

మున్నా తప్పకుండా చేస్తావు?" అంటూ గబగబా వెళ్ళిపోయింది.

'హుఁ చింత చచ్చినా పులుపు చావలేదు!' రెప్ప వేయకుండా రాధ వెళ్ళిన వేపే నిశ్చేష్టుడై చూస్తూండి పోయాడు.


• • •

మంచాని కడ్డంగా పడిపోయింది రాధ, ఇంటికి వస్తూనే! దుఃఖం కట్టలు తెంచుకుంది. 'కన్నా! ని న్నెప్పుడూ నే నిలా ఊహించుకోలేదు. నేను నిన్ను ఇలా... ఇలా... యాచించవలసి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

నీ పట్టుదల మెచ్చుకోదగ్గదే! అప్పటివాడివేనా నువ్వు? ! ఎంత మార్పు? ! ఎంత విచిత్రం? ! ఆనాడు మాధవరావుగారి దయా దాక్షిణ్యాలమీద నీ బ్రతుకు! ఈ నాడు మాధవరావుగారి అల్లుడి బ్రతుకు నీ దయాదాక్షిణ్యాల మీద! కన్నా! నే నిది భరించలేను. నీ సానుభూతి నన్ను దగ్ధం చేస్తూంది. నువ్వు కావాలనే ఇక్కడి కొచ్చావ్! అవును, అంతే! ఆ నాడు నిన్ను హేళన చేసి, నీ హృదయంమీద దెబ్బ తీసిన నన్ను చూసి నవ్వాలనీ, ఎదురుదెబ్బ తీయాలనీ వచ్చావు! అవును, అంతే! కానీ, కాకన్నా, వాడూ నేడూకూడా నా హృదయంలో స్థానం లేదు నీకు. మార్పూ లేదు. అప్పుడూ, ఇప్పుడూ నా దృష్టిలో నువ్వు ఒకటే! నా భర్తకి ఆఫీసరువే కావచ్చు. కానీ, నాకు మాత్రం ఆనాడు దిక్కులేక మా ఇంట్లో చేరిన అనాథవే!'

సరిగ్గా పది సంవత్సరాల క్రితం. . . అమ్మ పోయి సంవత్సర కూడా లేదు. "చూడు, నాయనా, నీ తల్లిలాంటిదాన్ని! నా మాట విను. ఎన్నాళ్లు పైవాళ్ళు చెయ్యగలరు? పిల్లకి మూడు ముళ్ళూ పడిపోతే పరాయిదై పోతుంది! నీకు వయస్సేం మించిపోలేదు. పాలమూరు వాళ్ళు ఇష్టపడుతున్నారు పిల్లనివ్వడానికి" అంటూ నాన్నగారికి నచ్చచెబుతున్నారు రావమాయమ్మగారు. మాకు దూరపు చుట్టం ఈవిడ. నాన్న చిరాకు పడ్డారు. "ఈ విషయంలో నా నిర్ణయం చాలా సార్లు చెప్పాను మీకు. మీరు చెయ్య లేకపోతేఎప్పుడువెళ్ళాలనుంటేఅప్పుడేవెళ్ళి పోవచ్చు!కానీ, ఈ ప్రసంగం మరితేకండి!" అంటూ సీరియస్‌గా చెప్పారు ఆవిడకి. ఆవిడ మూడో రోజే మూటాముల్లె సరి వెళ్ళిపోయింది. సోమయాజుల్ని తీసుకు వచ్చారు నాన్న వంటకని. ఇతను పెళ్ళిళ్ళకి వంటలు చేస్తాడు. దూబరా మనిషి. నీట్‌నెస్ లేదు. సిగరెట్లు కాలుస్తూనే వంట చేస్తాడు. గత్యంతరం లేక తీసుకువచ్చారు, నాన్నగారి కిష్టం లేకపోయినా. అయ్యంగారు మా నాన్నకి బెస్ట్‌ఫ్రెండ్! ఆయన మా అవస్థ చూడ లేక. మద్రాసునుంచి మంచి వంటవాణ్ణి తెప్పిస్తాననీ, అయితే అతను కుర్రాడనీ, ఎవరూ దిక్కులేనివాడనీ, బుద్ధిమంతుడే ననీ చెప్పారు. ఏ లోటూ రాకుండా చూస్తాననీ, త్వరగా తెప్పించమనీ నాన్న గారు బతిమాలారు. అన్నట్టుగానే వారం రోజుల్లోనే వచ్చాడు—పెద్ద జుట్టుముడీ, పెద్ద పెద్ద సోగకళ్ళూ, చామనచాయ రంగులో సన్నంగా, పొడుగా ఉన్నాడు. తెలుగు మాత్రం స్వచ్ఛంగా మాట్లాడు తున్నాడు. జుట్టుముడి చూసిన నాకు నవ్వాగలేదు. పాపం, సిగ్గుపడి పోయాడు. ఆ జుట్టుముడి చూసి, చిలిపిగా వెక్కిరిస్తూ, పకపకా నవ్వేది ఎప్పుడూ తను!

వంటలన్నీ బాగా చేసేవాడు. వంటిల్లు చాలా నీటుగా ఉంచేవాడు. అన్నీ టైము ప్రకారం చేసేవాడు. 'హమ్మయ్యా!' అంటూ ఊపిరి పీల్చు


కుటుంబములో
అందరికీ—
# అజంత
టూత్ బ్రష్‌లు

అజంత టూత్ బ్రష్‌లు, మీ పళ్ళను పూర్తిగా శుభ్రపరచుటకై, ఎంచుకోబడిన నైలాన్ బ్రిజిల్స్‌తో తయారుచేయబడినవి. ఇవి, గుండ్రవు నైలాన్ కుచ్చులు గలిగి, వైజ్ఞానికంగా డిజైన్ చేయబడినవి. ప్రతి బ్రష్ ఆరోగ్యకరంగా వుండుటకు, ప్రత్యేక కంటెయినర్‌లో ప్యాక్ చేయబడుతుంది. మీ పళ్ళను అతి శ్రేష్ఠమైన టూత్ బ్రష్‌తో తోముకొని ఆనందించండి—
అజంత 51

అజంత 41 పళ్ళు తోముకునేటప్పుడు ఎక్కువగా లోపలికి పోవునట్లు డిజైన్ చేయబడినది. అందువలన అన్ని పళ్ళను మీరు సుభ్రపరంగా తోముకోవచ్చును. అత్యంత విశిష్టత కలిగి, సరసమైన ధరకు అజంత 25 హార్డ్, మీడియమ్ లేక సాఫ్ట్ రకములు మీకు లభించును. బిడ్డలకు, పిల్లలకు ప్రత్యేక సాఫ్ట్ రకపు టూత్ బ్రష్‌లు లభిస్తాయి.

అందుబాటులో వుండే ధర కల అజంత లాంగ్ హెడ్, హార్డ్, మీడియమ్ మరియు సాఫ్ట్ రకములలోను, అజంత షేవింగ్ బ్రష్ మరియు అజంత హెయిర్ బ్రష్ కూడా లభిస్తాయి.

దీ బొంబే బ్రష్ కంపెనీ ప్రై. లి.
బొంబాయి-34 (డబ్ల్యు.బి.)

వచ్చేదే

## సంక్రాంతి ప్రత్యేక సంచిక

**పేజీలు 160　　19-1-72　　వెల: 1 రు.**

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 19-1-72 సంచిక సంక్రాంతి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. అనేక ప్రత్యేకాకర్షణలు, సంక్రాంతి విశేష త్రివర్ణ చిత్రాలు, వ్యాసాలు, కథలు...

—ఎడిటర్

కున్నారు నాన్నగారు. సాధారణంగా నా కెలా ఇష్టమో అలాగే చేసేవాడు. అస్తమానూ నాతో మాట్లాడాలని తాపత్రయపడేవాడు. కాలేజీ నుంచి రాగానే పుస్తకాల దగ్గర్నుంచీ అందుకునేవాడు. ఒక్కొక్కసారి అతను చూపించే వెర్రి అభిమానం నాకు విసుగనిపించేది. నా విసుగు చూడగానే చిన్నబుచ్చుకునేవాడు. 'పాపం!' అని నాకు వెంటనే జాలి వేసేది.

ఓ రోజున నా కిష్టమని బజ్జీలు చేస్తున్నాడు. డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని, పిచ్చాపాటీ మొదలెట్టాను ఏం తోచక. "కణ్ణా! మీ దేశ లే ఊరూ?"

"వందవాసి!" అన్నాడు, బజ్జీల ప్లేటు అందిస్తూ.

వేడి వేడిగా బాగున్నాయి బజ్జీలు. "అవును! 'వందవాసి' అని హిస్టరీలో చదివిన జ్ఞాపకం" అంటూ గబగబా తింటున్నాను బజ్జీలు.

నన్ను చూసి నవ్వుతూ, "హిస్టరీలో చదివారా? ఏమనీ?" అన్నాడు.

"ఏదో 'వందవాసి యుద్ధం' అని చదివానులే! ఎవరెవరికి, ఎప్పుడు జరిగిందీ, ఫలితా లేమిటీ — అని ఇప్పుడు అడక్కు. నా కేం జ్ఞాపకం లేదు. అదిసరేగానీ, నీకు తెలుగు ఇంత బాగా ఎలా వచ్చు? యాస లేకుండా మాట్లాడుతున్నావు?"

"మా నాన్నగారు ఆంధ్రాలోనే పని చేసేవారు. నేను చిన్నప్పటి నుంచీ ఆంధ్రాలోనే చదువుకున్నాను — స్కూల్ ఫైనల్ వరకూ."

"ఏమిటీ? నువ్వు స్కూల్ ఫైనల్ పాసైనావా? మరి, ఇలా. . ." అంటూ ఆశ్చర్యపోయాను. తినటం మానేసి, అతని వేపు వింతగా చూశాను.

"డిగ్రీ లున్నవాళ్లకే ఉద్యోగాలు సులువుగా దొరకటం లేదు. వట్టి స్కూల్‌ఫైనల్‌గాణ్ణి నా కెక్కడ దొరుకుతుందీ? మా అమ్మ నా చిన్నప్పుడే పోయింది. నాన్నగారు పోగానే నేనూ, అవ్వా వందవాసి వెళ్లిపోయాం. అక్కడ కోవెల్లో వంటవాడుగా చేరాను. బతకాలిగా మరి? తరవాత అవ్వకూడా పోయింది. నాకు అక్కడ ఉండాలని లేదు. ఎలాగైనా మళ్లీ ఆంధ్రాకి వచ్చేయాలని అనుకుంటుండగానే ఈ అవకాశం వచ్చింది" అంటూ, "తినండి, తినండి! మీ కిష్టమైన బజ్జీలు" అంటూ మరి రెండు ప్లేటులో వేశాడు.

'అయ్యో, పాపం, చదువుకున్నవాడే. అవకాశం ఉంటే ఇంకా చదువుకునేవాడే! తెలివైనవాడే మరి' అని ఆ రోజునుంచి అతన్ని గౌరవంగా చూసేదాన్ని. నాన్నగారికికూడా ఈ విషయం చెప్పగానే ఆశ్చర్యపోయారు. "సరేలే, కణ్ణా! నీ సంగతి ఆలోచిస్తాలే!" అన్నారు. ఆ నాటినుంచి నాన్నగారుకూడా స్వంత మనిషిలా అభిమానంగా చూస్తూ, బట్టలూ అవీ ఎక్కువగా కుట్టించేవారు. అతనుకూడా చనువుగా చాలా విషయాలు మాట్లాడుతుండేవాడు. ఒక్కొక్కసారి అతని చనువు నా కసహ్య మనిపించినా, ఏదోలే, పాపం! అని సరిపెట్టుకునేదాన్ని.

అప్పటికే నాకు నాన్నగారు ఎన్నో సంబంధాలు చూశారు. ఒక్కటీ నచ్చేది కాదు నాకు. అన్నీ తుళ్లగొట్టేసేదాన్ని. ఓ సారి నాన్నగారు— "నీ మనసులో ఏదైనా ఉంటే చెప్పమ్మా! ఇలా వస్తున్న సంబంధాలన్నీ నచ్చలేదంటే, నా కేం తెలుస్తుంది, చెప్పూ? నీ ఇష్టాన్ని నే నెప్పుడూ కాదనను!" అంటూ బుజ్జగించి అడిగారు.

"నా కసలు పెళ్లే చేసుకోవాలని లేదు, నాన్నా! ఇక మనసులో వేరే ఏముంటుంది? నాకు వేరే ఉద్దేశమేమీ లేదు. నాకు చేసుకోవాలని ఉన్నప్పుడు తప్పకుండా చేసుకుంటాను. అంతవరకూ ఏం చూడ"ద్దని ఖచ్చితంగా చెప్పాను. నాన్నగారు విసుగ్గా వెళ్లిపోయారు. ఇలా అన్న ఓ సంవత్సరం కాకుండానే ఓ డాక్టరు సంబంధం వచ్చింది. నాకు నచ్చలేదన్నాను. "నీకు ఏ విషయంలో నచ్చలేదో చెప్పు! అన్నీ బాగున్నాయి. నేను బతికి ఉండగా పెళ్లి చేసుకోవా ఏం? ఆలోచించి మరీ చెప్పు! ఇది అన్ని విధాలా మనకి తగ్గది. కాదనటం తేలికే! కన్నతండ్రిగా నా బాధకూడా అర్థం చేసుకుని మాట్లాడు. ముసలివాణ్ణీ, మూగవాణ్ణీ తెచ్చి నిన్ను చేసుకోమనటం లేదు. ఆలోచించు. ఏమైనా ఈ సంవత్సరం నీ పెళ్లి ఆగడానికి వీలులేదు" అని కోపంగా వెళ్లిపోయారు.

ఆ వేళంతా ఏడ్చాను. అలిగి అన్నం తినటం మానేశాను. ఎందుకు పెళ్లి మీదంత విముఖత్వం ఏర్పడిందో తెలియదు. ఇక తండ్రికేం చెబుతాను? పిచ్చిదానిలా అయ్యాను. ఆ వేళంతా శతవిధాలా బతిమాలాడు కణ్ణా! నువ్వు తినకపోతే నేనూ తిననన్నాడు. నీ ఇష్టం లేకుండా ఏదీ జరగదన్నాడు. పసిపాపని బుజ్జగించినట్లు బుజ్జగించి, బతిమాలి అన్నం తినిపించాడు. ఎన్నో కబుర్లు చెప్పి నవ్వించాడు. అమ్మ జ్ఞాపకం వచ్చింది నాకు అప్పుడు.

తరవాత వారం రోజుల వరకూ నాన్నగారు పెళ్లి విషయం ఎత్తలేదు. నేనూ తప్పించుకునే తిరిగాను, పట్టుదలగా మాట్లాడకుండా. అవును! ఆ వేళ బాగా జ్ఞాపకం ఉంది నాకు. చదువుకుందామని పుస్తకం తీశాను. అందులోంచి ఓ కవరు జారి పడింది. ఆశ్చర్యంగా విప్పి చదివాను. పిచ్చి కోపంతో గబగబా మేడమెట్లు దిగి, "కణ్ణా!" అని గట్టిగా అరిచినట్లుగానే పిలిచాను. ఈ అరుపుతో నాన్నగారూ, కణ్ణాకూడా పరుగెత్తుకొచ్చారు.

"ఇదా నీ బుద్ధి? ! నీ బ్రతుకేమిటో నీకు — తెలుసా? బండపడ్డ గాడిదలా చాకిరీ చేసుకుని, గరిట పట్టుకుని బతికే నీకు నాతో ప్రేమా, పెళ్లీ కావాలా? బుద్ధుందా నీకు? నీ ఆశకి అర్హత ఉందా? నీ అంతస్తేం — మా అంతస్తేం? ఒళ్లు దగ్గర పెట్టుకునే రాశావా ఇది? ఏదో నమ్మకంగా చాకిరీ చేస్తున్నావనీ, నోరు మంచిదనీ నిన్ను అభిమానంగా చూస్తుంటే ఇలా నెత్తి కెక్కాలనుకున్నావా? కణ్ణా! ఈ ఇంటి అల్లుడి అర్హత ఏమిటో తెలుసా? పెద్ద డిగ్రీ ఉండీ, హోదా, పలుకుబడీ, కారూ ఉన్న ఆఫీసరై ఉండాలి. ఇప్పు డాలోచించుకో— ఊహించుకోవటానికి కూడా నీ కా అర్హత ఉందో లేదో!" అంటూ పిచ్చి ఆవేశంతో ఊగిపోతున్న నన్ను చూసి కణ్ణా వణికి పోయాడు. "ఏమైందమ్మా? అసలేం జరిగిం"దంటూ నాన్నగారు కంగారుగా నా దగ్గరికి వచ్చారు. ఉత్తరం నాన్నగారికిస్తూ, "ఛీ!నీచుడా!" అంటూ పైకి వెళ్లిపోయాను. కింద నాన్నగారి కేకలు వినపడుతూనే ఉన్నాయి.

తిన్న ఇంటికే వాసాలు లెక్కపెడుతున్నావా? దౌర్భాగ్యుడా! పువ్వుల్లో పెట్టి పూజ చేస్తావా? నీ బతుక్కి పువ్వులూ, పూజాకూడానా? మా తిండి తిని ఒళ్లు పొగరెక్కిందిరా నీకు? దిక్కులేని వాడవని ఆదరించి, మాలో ఒకడిగా చూస్తున్నామని మా పరువుకే ఎసరు పెడదామనుకున్నావా? ఇన్నాళ్లూ చేశావనే విశ్వాసంతో నిన్ను తన్నకుండా పంపిస్తున్నాను. బ్రతికి పోయావు. ఫో! ఇక్కణ్ణుంచి! ఈ పొలిమేరల్లో ఎక్కడైనా కనిపించావా— ఉప్పుపాతర వేయించేస్తాను, బ్రతికి ఉండగానే! జాగ్రత్త! నాకు కోపం వస్తే అంతు తేలేవరకు నిద్రపోను. నా అంత మంచివాడూ లేడు, నా అంత చెడ్డవాడూ లేడు. ఏం, ఇంకా నిలబడ్డావు! నడు, బయటికి!" గెంటేశారు నాన్నగారు ఆ అర్ధరా(త్రి)

ఇప్పుడాఫీసరా? ! ఎంత విచిత్రం?'

''తలుపులన్నీ బార్లా తీసేసి ఏం చేస్తున్నావు?'' అంటూ లోపలికి వచ్చిన రామారావుని చూసి గతంలోంచి తేరుకుని, గాభరగా 'అప్పుడే అయిపోయిందా' అను కుంటూ వంటింటి వేపు పరుగెత్తింది.

''ఎప్పుడూ ఏడుపుమొహం నువ్వూనూ? ఇల్లంతా ఎలా ఉందో చూడు! చదువుకున్న కళలేం కనపడవు మొహాన్ని? ఎడ్డివాటం అంతా! ఆడదాని అదృష్టాన్నిబట్టే ఉంటుం దేదైనా! ఇలా ఏడుస్తూ ఉంటే పట్టేదికూడా పట్టదు.'' ఎర్రగా ఉబ్బిన కళ్లతో, ఎంతో విరక్తిగా కనిపించిన రాధని చూసి విసుక్కున్నాడు రామారావు.

* * *

''రాధా!

ఈ ఉత్తరం పూర్తిగా చదువు—చింపకుండా! నీ కోరిక ప్రకారం నేనే వెళ్ళిపోతున్నాను. నా ఉనికిని భరించలే నన్నావు! అందుకే నేనే వెళ్ళిపోతున్నాను. నీతో చాలా విషయాలు మాట్లాడ్దామను కున్నాను. కానీ, ఆ అవకాశం నువ్వు ఇవ్వలేదు. అందుకే రాయవలసి వచ్చింది.

ఆవేళ, ఆ అర్ధరాత్రి — చితికిన మనసులో ప్రేమని పదిలపరుచుకుంటూ, అల్లుడి అర్హత ఆఫీసరా అనుకుంటూ— 'రాధా! నీ కోసం, నీ కోసం తప్పకుండా, తప్పకుండా అవుతాను' అని శపథం చేసి, ఆ ఇంటి గడప దాటాను. అది మొదలు నా కష్టా లారంభమయ్యాయి. వంట వాడుగా, హోటలు సర్వరుగా ఎన్నో విషమ పరిస్థితుల్ని ఎదురుకున్నాను. అక్కడ చాకిరీతో నా చదువు సాగేది కాదు. ఒక తోటి సర్వరు సహాయంతో స్టూడెంట్సు లాడ్జిలో చేరి వాళ్లకి వండిపెడుతూ, వాళ మెప్పు సంపాదించుకుని, వాళ్ల సహకారంతోనే చదివి డిగ్రీ సంపాదించుకున్నాను. అందులో ఓ ఇంజనీరుగారబ్బాయి నాకు చాలా సహాయం చేశాడు. ఆ ఇంజనీరుగారూ, ఓ మినిస్టరూ ఫ్రెండ్స్! ఆయన తన పలుకుబడిని ఉపయోగించి నన్ను ఆఫీసర్ని చేశారు.

నువ్వన్న ప్రకారం నీ కోసం తపించి పోతూ, కారులో మీ ఊరు వెళ్లాను. గుర్రప్పందాల్లో మీ ఆస్తి పోగొట్టు కున్నారనీ, నీకు పెళ్లికూడా చెయ్యా లేదనీ, విశాఖపట్నం వెళ్ళిపోయారనీ మీ ఇల్లు కొన్నవాళ్లు చెప్పారు. ఎంతో కష్టంమీద ప్రయత్నించి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చాను, కొండంత ఆశతో! అప్పటినుంచీ నీ కోసం నా అన్వేషణ! సూపర్‌బజారు దగ్గర్నుంచి బీచ్, సినిమాహాల్సూ, పూర్ణా మార్కెట్టు వరకూ రోజూ చూస్తున్నాను, ఎక్కడైనా కనిపిస్తావేమోనని. ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతున్న సమయంలో అనుకోకుండా రామారావు ఇల్లాలుగా నిన్ను చూశాను. అంతులేని ఆశలతో అర్హత సంపాదించుకుని నీ కోసం, నీ కోసం, రాధా! నిజం! నీ కోసం ఇంత దూరం వస్తే నువ్వు నాకు అందకుండా పోయావు! అదీ నువ్వు అన్న అర్హతున్న ఆఫీసరు భార్యగాకాక, ఆఫీసు గుమాస్తా భార్యగా కనిపించేసరికి నా హృదయం బాధగా మూలిగింది. నా శ్రమంతా వృథా! అయినా, నువ్వుసుఖంగా ఉండాలనే కోరుకుంటున్నాను.

నిన్ననే మీ నాన్నగార్ని కూడా చూశాను, శంకరమఠం దగ్గర! ఆయనలో చాలా మార్పు వచ్చింది! ఆయన అన్ని విషయాలు చెప్పారు నాకు. పరిస్థితులకి తల వంచి, రాజీపడి ఈ పెళ్లికి ఒప్పు కున్నావనీ, నీకు సుఖసంతోషాలు దూర మయ్యాయనీ నాన్నగారు చెప్పారు. అనుక్షణం అనుమానిస్తూ, అవమానాలతో, నిందలతో నిన్ను నరకయాతన పెట్టే భర్తతో నువ్వు యమయాతన అనుభవిస్తున్నావని విన్నప్పుడు నే నెంతగా కుమిలిపోయానో చెపితే, బండబారిన నీ మనసు కేం అర్థ మవుతుంది?

ఆ నాడు నీకు అహంభావం తప్ప ఆలోచనే లేదు. ఈ నాడు బండబారిన మొండితనం తప్ప మనసే లేదు నీకు.

అప్పుడు వచ్చిన సంబంధాల్లో ఏది ఒప్పుకున్నా నీ కీ బాధ తప్పేది. లేదా నిన్ను ప్రేమించిన వాడికి విలువ నిచ్చినా నీ బ్రతుకు బాగుండేది.

రాధా! మనిషి విలువ హృదయంలో గానీ, ఆస్తుల్లోగానీ, అంతస్తుల్లో గానీ కాదు ఉంట. డబ్బూ, హోదా, పలుకుబడీ —ఇవి ప్రయత్నించి సంపాదించ గలిగేవి, క్షణికమైనవి. కానీ, ప్రేమానురాగాలు అపురూపమైనవి, శాశ్వతమైనవి. వీటికి విలువ కట్టలేవు. మనిషికి ఉండవలసింది అహంభావం, ఆవేశం కాదు. మమతా మార్దవాలతో నిండిన చల్లని మనసు, సానుభూతి చూపించగలిగే సహృదయం. ఇప్పుడైనా అవివేకంతో ఆవేశపడిపోక, పిల్లల్ని అయినా బాధ్యతగల తల్లిగా తీర్చిదిద్దు. వాళ్ళ భవిష్యత్తైనా బాగుండేలా చూడు. మానవత్వం గల మనుషు లుగా తయారుచెయ్యి.

రాధా! నీ కెప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా చెయ్యడానికి నేను సిద్ధమే! నిష్కల్మషమైన ప్రేమ నాది. నాడూ, నేడూ, ఏనాడూకూడా ఒకలాగానే ఉంది; ఉంటుంది.

మీ నాన్నగార్ని నాతో తీసుకు వెళుతున్నాను. ఆయన ఇక నా దగ్గరే ఉంటారు. ఏ లోటూ రాకుండా కన్న తండ్రి కంటే ఎక్కువగా చూసు కుంటాను. నువ్వేం బాధపడకు. బాధ్యత గల తల్లిగా, ఇల్లాలుగా రాణించాలనీ, మానసికంగా నువ్వు బాగా ఎదగాలనీ ఆశిస్తూ. . .

నీకు ఏమీకానీ, కాలేనీ...

—కన్నా.''

ఉత్తరమంతా రెండు సార్లు చదివి కసిగా చింపి పారేసింది. 'కన్నా! నువ్వు మామూలుగా వచ్చిఉంటేనిన్ను గౌరవించి, పాత విషయాలు మరిచిపోయి మర్యాదగా మాట్లాడి ఉండేదాన్ని. నువ్వు ఈ హోదాలో వచ్చి, నాకు మరీ చిరాకు తెప్పించావు! నిన్ను తలుచుకోవటానికే అసహ్యంగా ఉంది నాకు. నువ్వు సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నా, నేను నిన్ను కోరను ఎప్పుడూ ఎలాంటి సహాయం కూడా. అటువంటి పరిస్థితి కలగకుండా ఉండాలని పదేపదే భగవంతుణ్ణి ప్రార్థి స్తాను' అనుకుంటూ చింపి పారేసిన ఉత్తరం ముక్కలు గాలిలో ఎగిరి పోతుంటే చూస్తూ నిలబడిపోయింది.

''ఈ ఆఫీసరు చాలా మంచివాడు. తప్పకుండా సహాయం చేస్తాడు. ఈసారైనా తప్పకుండా ప్రమోషను వస్తుం దని ఎంతో ఆశ పడ్డాను. అదృష్ట వంతుల్ని చెడిపేవాడు లేడూ, దురదృష్టవంతుల్ని బాగుచేసేవాడూ లేడనీ—వచ్చి నెల్లాళ్ళైనా కాకుండా ట్రాన్స్‌ఫర్ అయిపోయింది'' అని ఆఫీసునుంచి వస్తూనే దిగాలుపడి పోయిన భర్తని చూస్తూ, తృప్తిగా నిట్టూర్చి, బాధగా, జాలిగా నవ్వింది రాధ! ★

